# మనసొంపుగా

ఆయన నావంకే చూస్తున్నారు!
చాలా సేపటినుంచి అలా చూస్తూనే వున్నారు.
మా తాతగారి వయసుంటుంది ఆయనకి.
అయినా కాస్త నాజూకుగా వుండే అమ్మాయి కని పిస్తే చాలు వయసు తేడా లేకుండా చొంగ కార్చేస్తూ, నోరెళ్ళబెట్టి చూస్తుంటారు. ఛీ..ఛీ.. ఏం మొగాళ్ళు!
అందుకే పెద్దవాళ్ళంటే గౌరవం లేకుండా పోతోంది ఈ రోజుల్లో.
నాలుగైదుసార్లు చురుగ్గా చూశాను ఆయనవైపు.
అయినా చలనం లేదు. పైగా కళ్ళజోడు తీసి తుడుచుకుని మరీ తేరిపార చూస్తున్నారు నావైపు.

# ఆ క్షణం తొందరపడితే...

ఒక్కసారి దగ్గరకెళ్ళి ఆయన చొక్కా పట్టుకుని 'ఏమయ్యా ముసలాయనా! నీకేమైనా బుద్ధుందా? నీ మనవరాలి వయసున్న అమ్మాయిని గుడ్లప్పగించి చూస్తున్నావ్' అని చెడామడా తిట్టెయ్యాలనిపించింది. అయినా సాహసం చేయలేక ఊరుకున్నాను. కొద్ది క్షణాల తర్వాత ఆ ముసలాయన విషయం వదిలేసి నా పనిలో పడిపోయాను. మా ఆఫీస్‌కి ఎంతోమంది వస్తుంటారు. రకరాల మనస్తత్వాల వాళ్ళు. అందులో వక్రబుద్ధులున్నవాళ్ళే ఎక్కువగా వుంటారనిపిస్తుంది. అందుకే ఆయన సంగతి వదిలేసి నా పనిలో నిమగ్నమైపోయాను.

కొద్ది క్షణాల విరామం తర్వాత,

"అమ్మాయ్! నీ పేరేమిటి?" అన్న మాట విని ఉలిక్కిపడి చివాలున తలెత్తి చూశాను. ఆ పెద్దాయన నా దగ్గరగా వచ్చి తల కొంచెం పైకెత్తి కళ్ళద్దాల క్రిందనుంచి నావంక చూస్తూ అడిగాడు.

"నీకెందుకు? నీ పనేదో చూసుకుని పోవయ్యా' అందామనుకున్నాను. కాని సభ్యత అడ్డవచ్చింది. 'మంచి చదువులు చదివి, మంచి హోదాలో వున్నవాళ్ళకైతే సభ్యత, సంస్కారాల గురించి తెలుస్తుంది కాని ఇలాంటి అక్షర జ్ఞానం లేని పల్లెటూరి మనుషులకేం తెలుస్తుంది?' అని మనసులో అనుకున్నాను.

"అమ్మాయ్! నిన్నే! నీ పేరేమిటో" అన్నాడాయన భుజం మీది పై పంచె సరిచేసుకుంటూ.

చెప్పకపోతే వదిలేట్టు లేదు ఈ ముసలాయన. చెప్పాలని అనిపించకపోయినా, 'పోనీలే' అని నా పేరు చెప్పాను.

"ఏ ఊరేమిటి మనది" అన్నాడాయన మళ్ళీ నాకు బాగా చికాకనిపించింది. అయినా పైకి కనిపించనీయకుండా ఊరి పేరు చెప్పాను. ఆయన రెండు క్షణాల పాటు నావంక అలాగే చూశాడు. అంత వయసులో వున్నాయన నా ఎదురుగా నిలబడి వుండడం కాస్త ఇబ్బందనిపించింది.

'నీవొచ్చిన పనేంటి? అది చూసుకుని వెంటనే పో. నన్ను డిస్టర్బ్ చేయకు' అని గట్టిగా మందలించాలనిపించింది. కాని సభ్యత కాదు కదా అందుకే ఇష్టం లేకపోయినా పెదాల మీద చిరునవ్వు వులుముకుని "నిలబడే వున్నారే! కూర్చోండి" అన్నాను. నా మాటల్లో వున్న వినయానికి నాకే ఆశ్చర్యం వేసింది.

ఆయన పంచె సర్దుకుంటూ నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. పాతకాలవు కళ్ళజోడు తీసి నా టేబుల్‌పై పెట్టాడు. 'ఛీఛీ పాడు కళ్ళజోడు. అందమైన నా టేబుల్‌పైన దిష్టిబొమ్మలా వుంది' అనుకున్నాను.

'ఇంతకూ మీ ఇంటిపేరేమిటన్నావ్?' అని అడిగాడాయన. నాకు కోపం వచ్చింది. ఈయనకు నా బయోడేటాతో పనేంటి? పోనీలెమ్మని కూర్చోనిస్తే ఇంటివాసాలు లెక్క పెట్టేట్టున్నాడే. ప్యూన్‌ని పిలిచి ఆయన్ని బయటికి పంపించేయాలనిపించింది. కాని ఎందుకులే అని వదిలేశాను.

ఆయన నావంకే చూస్తుండడంతో తప్పదనిపించి ఇంటి పేరు చెప్పాను.

"అది మీ కన్నవారి ఇంటిపేరా? లేక అత్తవారి ఇంటిపేరా?" అని అడిగాడాయన.

'పెళ్ళయిన అమ్మాయి అత్తవారింటి పేరు తప్ప కన్నవారింటి పేరు చెబుతుందా? అది కూడా తెలీదు' అనుకుని

'మా అత్తవారింటి పేరండి' అన్నాను నెమ్మదిగా.

"బాగుందమ్మా. ఎంచక్కా అత్తవారింటి పేరుని సొంతం చేసుకున్నట్టే చెప్పేశావే! బాగుంది బాగుంది. మరి... కన్నవారింటి పేరేమిటో" అని అడిగారాయన. నాలో సహనం చచ్చిపోతోంది. అయినా ఓపిగ్గా నా కన్నవారింటి పేరు చెప్పాను.

'చాదస్తం ముసలాళ్ళకి వుండే జాడ్యం. ఆ చాదస్తవు ప్రశ్నలతో అవతలివాళ్ళని వేధించుకు తింటారు' అనుకున్నాను మనసులో. ఇలా నన్ను ఎవరైనా ప్రశ్నలతో వేధిస్తే సహించే మనస్తత్వం కాదు నాది. వెంటనే చెడామడా తిట్టేస్తాను. అందులోనూ ముక్కూ మొహం తెలీని వ్యక్తి నా గురించి వ్యక్తిగత విషయాల గురించి డైరెక్ట్‌గా నాతోనే మాట్లాడుతుంటే నాకు ఒళ్ళంతా మండిపోతోంది. వయసులో పెద్దవాడన్న జాలితో ఇంత సేపు ఓపిగ్గా సమాధానాలిచ్చాను. నిజానికి నాకే ఆశ్చర్యమేసింది. నాలో ఇంత ఓపిక, సహనం వున్నాయా? అని. అర్థం పర్థంలేని ప్రశ్నలతో ఆడపిల్లలతో ఏవో కబుర్లుచెప్పి సంతృప్తిపడే ఇలాంటివాళ్ళంటే నాకు పరమ అసహ్యం. ఏదో దూరపు చుట్టంలా అన్ని విషయాలు అడుగుతున్నాడు. కొంపదీసి ఏదో ఒక చుట్టరికం కలి పేసి 'నాకు ఫలానా పని

చేసి పెట్టమ్మా' అని పీకలమీద కూర్చోదు కదా! ఏమో! ఎవరికి తెలుము? అసలు ఇంతసేపు ఆయన్ని కూర్చోబెట్టి మర్యాదగా మాట్లాడడమే తప్పు ముందే గెటౌట్ అని పంపేయాల్సింది. అసలు ఈ ప్యూన్‌గాడేమైపోయాడో. సమయానికి కనిపించడు.

ఛీఛీ మిగతా కొలీగ్సంతా ఒకటికి రెండు సార్లు మా ఇద్దరివంకా చూస్తూ వున్నారు. ఇతరుల విషయాల మీద, ప్రత్యేకించి నా



విషయాల మీద ఆసక్తి ఎక్కువ. నేను లేని సమయంలో నా గురించే చెవులు కొరుక్కుంటారు. ఈ ముసలాయన వల్ల వాళ్ళకి అనవసరంగా ఓ 'సబ్జెక్ట్' ఇచ్చినదాన్నయ్యాను అని మనసులో తెగ మధనపడిపోతూ అనీజీగా సీట్లో అటూ ఇటూ కదిలాను.

"అయితే నువ్వు మాధవపురంలో వుండే సుందరేశ్వరరావుగారి అమ్మాయివి కదూ" అన్నాడాయన.

నేను చాలా ఆశ్చర్యపోయాను. మా ఊరి పేరు, నాన్నగారి పేరు ఖచ్చితంగా చెప్పినందుకు.

"అవునండీ" అన్నాను ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"మరి ఇందాక మరేదో ఊరి పేరు చెప్పావేంటమ్మా?" అన్నారాయన.

"అదా! అది మావారి నేటివ్ ప్లేసండీ. అదే వారి సొంత ఊరు" అన్నాను.

ఆయన పకపకా నవ్వి,

"గడుసుదానివే. మీ నాయనమ్మ కూడా ఇలాగే చమత్కారంగా మాట్లాడేది. మీ తాతగారు రామభద్రంగారు, మీ నాయనమ్మ తులశమ్మగారు నాకు బాగా తెలుసమ్మా. మీ తాతగారింటి పొరుగిల్లే మాది. మా ఇంటి వీధి అరుగుల మీద కూర్చుంటే మీ గొడ్ల చావిడి అంతా కనిపిస్తుండేది" అన్నారాయన.

మా తాతగారి పేరు చెప్పేసరికి ఆయనమీద ఎనలేని గౌరవం ఏర్పడింది. అనవసరంగా ఆయన్ని మనసులో నానా మాటలు అన్నందుకు నొచ్చుకున్నాను. అదే సమయంలో అటు వచ్చిన ప్యూన్‌ని పిలిచి కూల్‌డ్రింక్స్ తెమ్మని సైగ చేశాను.

"నీదంతా మీ నాయనమ్మ పోలికమ్మా! తులశమ్మ కూడా అచ్చం నీలాగే వుండేది. నిన్ను చూడగానే తులశమ్మని చూసినట్టే వుందనుకో! మీ నాన్న కూడా మీ నాయనమ్మ నోట్లోంచి ఊడిపడ్డట్టుండేవాడు. తల్లి పోలిక అదృష్టం అనేవారు. నీకు మీ నాన్న పోలికన్న మాట. అందుకే అదృష్టవంతురాలివి" అన్నారు.

నేను అప్పటిదాకా చేస్తున్న పనిని పక్కన పెట్టేశాను.

"మీ పెద్దవాళ్ళంతా ఎంతో మంచివాళ్ళమ్మా. ఎంతో వినయం, విధేయతలతో వుండేవారు. సభ్యత, సంస్కారాలు వాళ్ళలో ఉట్టిపడుతుండేవి. నిన్ను చూస్తుంటే వాళ్ళ మంచి లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నట్టు వున్నావ్. చాలా సంతోషమమ్మా. ఈ రోజుల్లో ఇంత పొందికైన మనుషులెక్కడున్నారమ్మా! పెద్ద వాళ్ళంటే కనీస గౌరవం కూడా లేకుండా ప్రవర్తిస్తుంటారు. ఎవరి వరకో ఎందుకు? నా మనవడే వున్నాడు. అదేనమ్మా మీ మేనేజరు. వాడికి అక్షరాభ్యాసం చేసింది నేను. ఆ రోజుల్లో స్కూల్‌ఫైనల్ దాకా చదివాను. అయినా వాడేదో బోలెడంత చదివేసినట్టు ఇంగ్లీషులో మాట్లాడతాడు. వాడి ఇంగ్లీషు గ్రామర్‌ని నేనే అప్పుడప్పుడూ కరెక్ట్ చేస్తుంటాను. వాడేమో నాతో గొడవ పడుతుంటాడు. పాతకాలపు ఇంగ్లీషు వేరు, ఇప్పటి ఇంగ్లీషు వేరు అని వాదిస్తాడు. ఏమిటో భాషలు మారిపోతున్నాయ్, మనుషులు మారిపోతున్నారు. మాట తీరు, మనస్తత్వాలు కూడా మారిపోతున్నాయ్. సర్లేమ్మా. ఏదేదో చెప్పేస్తున్నాను. ముసలితనం కదమ్మా. చాదస్తం జాస్తీగా వుంటుంది. నిన్ను చూడగానే పాతరోజులన్నీ గుర్తుకొచ్చాయి. నిన్ను పలకరిస్తే సరిగ్గా రిసీవ్ చేసుకుంటావో లేదోనని చాలాసేపు సంకోచించాను. చివరికి వుండబట్టలేక అడిగాను. నిన్ను ఇబ్బంది పెడితే మన్నించమ్మా!" అని ఆయన ఇంకా ఏదో అంటుండగా మా మేనేజర్‌గారు రావడంతో

"వస్తానమ్మా!" అంటూ ఆయన మేనేజర్ ఛాంబర్‌లోకి వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిపోయినా, తేరుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది. కొద్ది క్షణాలు ఓపిగ్గా వుండబట్టి సరిపోయింది. కాని పొరపాటున ఆయనతో చికాకుగా, విదిలించినట్టు మాట్లాడి వుంటే ఆయన ఎంత బాధపడి వుండేవాడు! పైగా అంత మంచివాళ్ళ మనవరాలు ఇలా దురుసుగా వుందని తెలిసిన వాళ్ళందరికీ చెప్పేవాడు. అసలు తాతలు, తండ్రుల గురించి తెలిసినవాళ్ళెవరున్నారు ఈ రోజుల్లో. పైగా ఆయన మా మేనేజర్‌కి తాతగారు. మనిషి చూడడానికి పల్లెటూరి బైతులా వున్నారు కాని చదువుకున్నవాడు. నేను తొందరపడి నోరు జారివుంటే... ఆ విషయాన్ని ఆయన మేనేజర్‌గారికి చెప్పివుంటే... అమ్మో ఆలోచించడానికే భయమేసింది.

నాన్నగారు ఎప్పుడూ చెబుతుండే మాటలు ఆ క్షణంలో నా చెవుల్లో మారుమోగాయి. 'ఏ విషయంలోనూ తొందరపాటు పనికిరాదు. ఎవరినైనా దూషించడం కాని, తూలనాడడం కాని తగని పని. నిరంతరం సభ్య, సంస్కారాలను అతిక్రమించి ప్రవర్తించకూడదు. అవే మనిషన్న వాడికి భూషణాలు. ఎదుటివారిని తక్కువగా అంచనావేయడం, చులకన చేయడం తప్పు'... ఇలాగే ఇంకా ఎన్నో చెప్పేవారు. కాని ఇలాంటి సంఘటనలు జరిగినపుడే అవి గుర్తుకొస్తుంటాయి. అందుకే ప్రతిరోజు సుమతీ శతకం, వేమన శతకం చదవాలని అంటారు. అందులో నిజమెంతో నాకిప్పుడు బోధపడింది.

—'మోతీలాస్య'